సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం ; 28 ; అక్టోబర్ ; 2023



పంచాయతీలకు పైసలేవీ.?

జిల్లాలోని గ్రామపంచాయతీలకు గత ఏప్రిల్ నెల నుంచి రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడంలేదు.

10లో



చెదిరిపోతున్న జ్ఞాపకం

ఆరు దశాబ్దాలపాటు అలరించిన పాల్వంచలోని వేణుగోపాల్ థియేటర్ కనుమరుగవుతోంది.

12లో

గరిష్టం / కనిష్టం
32° / 22°

వాతావరణం

జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగానే ఉండవచ్చు. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

పంటమార్పిడితో రైతులకు మేలు

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): పంట మార్పిడి వల్ల రైతులకు మేలు జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఉద్యాన, వ్యవసాయ, గోద్రెజ్, ఆయిల్‌ఫెడ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సంప్రదాయ పంటలను విడనాడి రైతులు పామాయిల్ సాగు చేపట్టి అధిక లాభాలు పొందాలని సూచించారు. అక్టోబర్ మాసం వరకు జిల్లాలో 8,400 ఆయిల్‌పామ్ మొక్కలు నాటాల్సి ఉండగా 7,147 మొక్కలను నాటామని చెప్పారు. మిగిలిన 1,253 మొక్కలను ఈనెలాఖరు వరకు నాటేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లక్ష్యం పూర్తికాకపోవడంపై ప్రభుత్వ అధికారులతోపాటు గోద్రెజ్ కంపెనీ అధికారులపై కూడా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న వేసవిలో పంటసాగుపై క్రాప్ బుకింగ్ చేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి కొర్స అభిమన్యుడు, ఉద్యాన అధికారి జినుగు మరియన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయాన్ని రికార్డు చేయాలి

నోడల్ అధికారి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న నోడల్ అధికారి వెంకటేశ్వర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికల వ్యయ వివరాలు రికార్డు చేయాలని వ్యయ నోడల్ అధికారి, డీసీఓ ఎన్.వెంకటేశ్వర్లు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సహాయ వ్యయ పరిశీలన అధికారులు, అకౌంట్స్, వీడియో సర్వైలెన్స్, వీడియో వ్యూయింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల ద్వారా రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీల వివరాలు తీసుకుని వీడియో రికార్డింగ్ చేయాలన్నారు. పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుపై ఎన్నికల సంఘం రూ.40 లక్షల సీలింగ్ విధించిందని, ప్రతి పైసా లెక్కింపు జరగాలని స్పష్టం చేశారు. రూ.10 వేలకు మించి చెల్లింపులు ఉంటే చెక్కు, ఆర్‌టీజీఎస్, ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేయాలని సూచించారు. అభ్యర్థులు ఖర్చుకు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్యాంకు ఖాతా నుంచి మాత్రమే చెల్లింపులు చేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యయ నియంత్రణ కోఆర్డినేటింగ్ అధికారి వెంకటేశ్వరరెడ్డి, మాస్టర్ ట్రైనీ నోడల్ అధికారి శ్రీనివాసరావు, ఎంసీఎంసీ నోడల్ అధికారి ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

అన్నపురెడ్డిపల్లి: వైద్యాధికారులు గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష ఆదేశించారు. మండల పరిధిలోని ఎర్రగుంట పీహెచ్‌సీని ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. వైద్యం కోసం వచ్చిన గర్భిణులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేయించుకోవాలని చెప్పారు. అనంతరం పీహెచ్‌సీ రికార్డులను , ఫార్మసీ, ల్యాబ్‌లను తనిఖీ చేశారు. వైద్యాధికారులు ప్రియాంక, తన్మయిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ పరిధిలోని హాస్టళ్లను సందర్శించాలని, విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత, సిబ్బంది కృష్ణయ్య, నాగేశ్వరరావు, శారారాణి, కళ్యాణ్, ప్రేమలత పాల్గొన్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

దుమ్ముగూడెం : మండలంలో చేపట్టిన క్రీడా మైదాన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ డాక్టర్ వినీత్ అధికారులను ఆదేశించారు. ములకపాడు గ్రామంలో రూ.2.26 కోట్ల నిధులతో నిర్మిస్తున్న క్రీడా మైదానాన్ని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఐటీడీఏ డీఈ హరీష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సీఐ దోమల రమేష్, ఎస్‌ఐలు కేశవరావు, గణేష్, ఐటీడీఏ ఏఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

రామదాసుతో మోక్షం.. సీతారామతో కరువు దూరం



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్, పక్కన పాలేరు బీఆర్ఎస్ అభ్యర్థి కందాల, వేదికపై మంత్రి పువ్వాడ, ఎంపీలు నామా, రవిచంద్ర తదితరులు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిస్తేనే ఖమ్మం అభివృద్ధి

- తుమ్మల ఇంట్లో మూలన కూర్చుంటే మిత్రుడని చేరదీశా
- డబ్బు మదంతో రాజకీయాలు.. పాలేరులో పోటీకి ప్రయత్నం
- పాలేరు ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'మేము చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలన్నీ జరగాలంటే కచ్చితంగా బీఆర్ఎస్ గెలవాలి. బీఆర్ఎస్ ఎలాగూ అధికారంలోకి వస్తది. ఖమ్మంలో రెండుసార్లు మాకు ఒక్కో సీటే వచ్చింది. అయినా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు కూడా బీఆర్ఎస్ వస్తది. ఖమ్మం ప్రజలకు నాది ఒకటే విజ్ఞప్తి. ఎవరో ఎల్లయ్య, మల్లయ్య గెలిస్తే అయ్యేదేం లేదు. అదే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిస్తే.. బ్రహ్మాండంగా జిల్లా అభివృద్ధికి పాటుపడతారు. సీతారామ ప్రాజెక్టును పూర్తిచేస్తారు. పోడు భూముల పంపిణీ కింద జిల్లాలో లక్షలాది ఎకరాలను పంపిణీ చేసి రైతుబంధు, రైతుబీమా కూడా చేశాం. గతంలో ఉన్న పోడు కేసులన్నీ ఎత్తివేశాం. పాలేరులో ఇంజనీరింగ్ కాలేజీ తెచ్చుకున్నాం. ఖమ్మం పక్కనే పాలేరు ఉంటుంది కాబట్టి.. రాబోయే రోజుల్లో ఖమ్మం, పాలేరు చెట్టాపట్టాలు వేసుకుని బ్రహ్మాండంగా అభివృద్ధి జరుగుతాయి'. అని ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. పాలేరు నియోజకవర్గానికి సంబంధించి కూసుమంచి మండలం జీళ్లచెరువులో శుక్రవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు నాలుగు మండలాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. ఈసభలో పాల్గొన్న కేసీఆర్ తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆయన తన ప్రసంగంలో ఓవైపు కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తూనే.. మరోవైపు ప్రత్యక్షంగా మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పరోక్షంగా మాజీ ఎంపీ పొంగులేటి పై విమర్శలు సంధించారు. గతంలో రెండుసార్లు ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌కు ఒక్కో సీటే వచ్చినా అభివృద్ధి చేశామని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందంటూ కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

సత్తుపల్లిలా పాలేరులోనూ దళితబంధు..

మా దగ్గర దళితులు పెద్ద సంఖ్యలో ఉన్నారని ఉపేందర్‌రెడ్డి అన్నారు. అలాగే గిరిజనులు పెద్ద



సీఎంకు జ్ఞాపిక అందిస్తున్న కందాల ఉపేందర్‌రెడ్డి

సంఖ్యలో ఉన్నారని చెప్పారు. మీరు ఉపేందర్‌రెడ్డిని గెలిపిస్తే పాలేరు నియోజకవర్గమంతా సత్తుపల్లి మాదిరి దళితబంధు పెట్టించే బాధ్యత నాది. నేనే స్వయంగా వచ్చి ఎట్లయితే హుజూరాబాద్‌లో చేశామో అట్ల చేస్త.

కరువు కాటకాల నుంచి మోక్షం..

బీఆర్ఎస్ ప్రభుత్వం రాకముందు ఈ రాష్ట్రంలో చాలా పార్టీలు రాజ్యం చేశాయి. పాలేరు ప్రజలను వారి కర్మకు వదిలారు. మంచినీళ్లు, సాగునీరు ఇవ్వాలని ఆలోచన చేయనే లేదు. ఇప్పుడు పాలేరుకు మోక్షం లభించిందంటే అది బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాకే. భక్తరామదాసు ప్రాజెక్ట్ పూర్తి చేసి బ్రహ్మాండంగా నీళ్లు ఇచ్చాం. కమ్యూనిస్టులు కూడా చాలాకాలం ఇక్కడ ఎమ్మెల్యేలుగా ఉన్న ప్రాంతం. ఉద్యమాలు జరిగిన ప్రాంతం. మీ అందరినీ కోరేది ఒక్కటే నీతి నిజాయితీ, చిత్తశుద్ధితో ప్రజల కోసం కులం, మతం లేకుండా సర్వజనుల సంక్షేమం కోసం ఎవరు పనిచేశారో వారిని గెలిపించాలి.

కడుపులో పేగులు లాగుతారు..

జిల్లాలో ఇద్దరు బహురూపుల నాయకులు ఉన్నారు. డబ్బు అహంకారం. డబ్బుతో ఎవరినైనా కొనగలం, ఏదైనా చేయగలం, అని అహంకారపూరిత మాటలు మాట్లాడుతున్నారు. ఆ నాయకులు ఎవరో మీకు తెలుసు. పాలేరులో నిలబడాలని ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ వాకిలి కూడా తొక్కనివ్వబోమని మాట్లాడుతున్నారు. నాలుగు పైరవీలు, నాలుగు కాంట్రాక్టులు చేసి సంపాదించుకుని, డబ్బు మదంతో ప్రజలు, ప్రజాస్వామ్యాన్నే కొంటాం అని అహంకార పూరిత మాటలు మాట్లాడుతున్నారు. ఇది రాజకీయమా? ఇవ్వాళ కోట్లకు కోట్లు ఖర్చు పెట్టి ఓట్లు తీసుకుని ఏమార్చి.. అదే చేయి పెట్టి కడుపులో పేగులు లాగుతారు. ఆ మాట మర్చిపోతమా.. దెబ్బతింటం. అని సీఎం పేర్కొన్నారు. సభలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు.

ఆ నాలుకలు ఉల్టా మాట్లాడుతున్నాయి..

కేసీఆర్ వల్లే పాలేరుకు మోక్షం వచ్చిందని మాట్లాడిన నాలుకలు ఈరోజు ఉల్టా మాట్లాడుతున్నయి. నరం లేని నాలుక మారవచ్చు కాని సత్యం మారదు కదా.. నిజం నిప్పు లాంటిది కదా.. ఎవరి వల్ల మోక్షం వచ్చిందో మీకు తెలుసు. లంబాడీ తండాలను ఎవరు పంచాయతీలను చేశారో మీకు తెలుసు. మా తండాల్లో మా రాజ్యం, మా గూడెంలో మా రాజ్యం అంటే ఎవరూ కనికరించలేదు. పాలేరు నియోజకవర్గంలో 38 నుంచి 40 తండాలు గ్రామపంచాయతీలయ్యాయి. ఇవ్వాళ లంబాడీ బిడ్డలు వారి తండాల్లో వారే రాజ్యం చేస్తున్నారు.

నువ్వు చేసింది గుండుసున్నా..

మిత్రుడు తుమ్మల నాగేశ్వరరావు నేను ఆయనకు అన్యాయం చేశానని ప్రచారం చేస్తున్నారు. ఆయన ఖమ్మంలో అజయ్‌పై ఓడిపోయి ఇంట్లో కూర్చొంటే.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నేను పాత స్నేహితుడని, సీనియర్ నాయకుడని తీసుకొచ్చి ఎమ్మెల్సీని చేశాం. పాలేరులో ఆనాడు వెంకటరెడ్డి చనిపోయాక వాస్తవానికి వెంకటరెడ్డి భార్యను మేము అభ్యర్థిగా పెట్టాలనుకున్నాం. కానీ ఈన వచ్చి అన్నా.. నా నియోజకవర్గం రిజర్వ్ అయింది. నాకు అవకాశం ఇస్తే పాలేరుకు సేవ చేస్తా.. పాలేరును కాపాడుకుంటా అన్నడు. బై ఎన్నికల్లో టికెట్ ఇచ్చి.. బ్రహ్మాండంగా పాలేరు నియోజకవర్గ ప్రజలు 42 వేల మెజార్టీతో గెలిపించారు. మీకు ఇంత పనిచేసి ఓడిపోయి ఉంటే మంత్రిని చేసి ఎమ్మెల్సీని చేసి.. పాలేరులో ఎమ్మెల్యేను చేసి.. జిల్లా మీద ఏకచత్రాధిపత్యం ఇస్తే నువ్వు చేసిందేంది? గుండుసున్నా. ఖమ్మం జిల్లాలో ఒక్క సీటు రాకుండా చేశావు. ఎవరు ద్రోహం చేశారు. ఇవన్నీ మర్చిపోలేం. ఇవ్వాళ వచ్చి అడ్డగోలుగా నోరుంది కదా అని కేసీఆర్ మీద, బీఆర్ఎస్ మీద, అజయ్ మీద, నామ మీద, ఇతరుల మీద అడ్డగోలుగా మాట్లాడితే ప్రజాస్వామ్యం కాదు.. అరాచకం. ఈ అరాచకాన్ని తిప్పి కొట్టాల్సింది ప్రజలే. అరాచక రాజకీయవేత్తలకు బుద్ధి చెప్పాల్సింది ప్రజలే.

పినపాక నుంచి పాయం

- 'అసెంబ్లీ' రెండో జాబితాలో ప్రకటించిన కాంగ్రెస్
- పెండింగ్‌లో ఇల్లెందు, అశ్వారావుపేట నియోజకవర్గాలు
- కొత్తగూడెంపై కొనసాగుతున్న సస్పెన్స్

సాక్షి ప్రతినిధి, కొత్తగూడెం: కాంగ్రెస్ పార్టీ శుక్రవారం రాత్రి విడుదల చేసిన రెండో జాబితాలో జిల్లాలోని పినపాక అసెంబ్లీ నియోకవర్గానికి చోటు దక్కింది. ఇక్కడి నుంచి మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అభ్యర్థిత్వం ఖరారు చేసింది. పినపాక నుంచి పోటీ చేసేందుకు మొత్తం 17 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరి పేర్లను వడబోసి, వివిధ రాజకీయ సమీకరణాలను పరిశీలించిన కాంగ్రెస్ పెద్దలు చివరకు పాయం వైపు మొగ్గు చూపారు. దీంతో టికెట్ కోసం చివరి నిమిషం వరకు తీవ్రంగా ప్రయత్నించిన పోటెబోయిన శ్రీవాణి, విజయ్‌గాంధీలకు చివరకు నిరాశే మిగిలింది. పీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్‌గా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కొన్నేళ్లుగా పాయం రాజకీయ ప్రస్థానం కొనసాగిస్తున్నారు. పొంగులేటితో పాటుగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మలిజాబితాలో పాయంతోపాటు పాలేరు టికెట్‌ను పొంగులేటికి కేటాయించారు.

పేట కోసం ముగ్గురి ప్రయత్నం..

తెలంగాణ అసెంబ్లీలో మొత్తం 119 స్థానాలు ఉండగా ఇప్పటికే 100 చోట్ల అభ్యర్థుల ప్రకటన పూర్తయింది. ఇంకా 19 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఇందులో జిల్లాకు సంబంధించి ఇల్లెందు, అశ్వారావుపేట, కొత్తగూడెం స్థానాలు ఉన్నాయి. ఇల్లెందు, అశ్వారావుపేటలకు అభ్యర్థులను పెండింగ్‌లో పెట్టడం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. అశ్వారావుపేట నుంచి పది మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుతో పాటు జారె ఆదినారాయణ, సున్నం నాగమణిలు టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రెండో జాబితాలోనూ ఈ నియోజకవర్గానికి చోటు దక్కకపోవడంతో ఇక్కడి నేతలు లాబీయింగ్‌ను మరింత పదునెక్కించనున్నారు.



ఇల్లెందుపై ఉత్కంఠ..

ఇల్లెందు నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య కాంగ్రెస్ సీటును ఆశిస్తున్నారు. కాగా ఇక్కడ బంజారాలకు అవకాశం ఇవ్వాలంటూ మరోవర్గం గట్టిగా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఇల్లెందు సీటు ఎవరికి దక్కుతుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. తాజాగా ఇల్లెందును పెండింగ్‌లో పెట్టడంతో ఇక్కడ హస్తం పార్టీలో రాజకీయం మరింత ముదురు పాకన పడుతోంది. ఇల్లెందు టికెట్ కోసం చీమల వెంకటేశ్వర్లు, ప్రవీణ్ నాయక్, శంకర్ నాయక్, గుగులోత్ రవి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల పొత్తు కారణంగా కమ్యూనిస్టులకు కొత్తగూడెం సీటు కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు కాంగ్రెస్ నేతలు సైతం టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు.

అభ్యర్థి ప్రొఫైల్



పాయం వెంకటేశ్వర్లు

పేరు: పాయం వెంకటేశ్వర్లు
తండ్రి: కామరాజు
తల్లి: రాములమ్మ
భార్య: ప్రమీల, ఇద్దరు కుమార్తెలు
పుట్టిన తేదీ: 06.05.1974, బందారుగూడెం, మణుగూరు
విద్యార్హత: బీఏ

రాజకీయ నేపథ్యం: సామాన్య గిరిజన రైతు కుటుంబంలో జన్మించిన పాయం వెంకటేశ్వర్లు విద్యార్థి దశ నుంచే రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్నారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, సీపీఐలో క్రియాశీలకంగా పనిచేసిన ఆయన 1999లో సీపీఐ అభ్యర్థిగా బూర్గంపాడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓటమి చెందారు. 2004లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సీపీఐ నుంచి గెలిచారు. 2009లో సీపీఐ నుంచి పినపాక నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 2014లో పినపాక నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఈ క్రమంలోనే ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడిగా కొనసాగుతూ 2013 నుంచి 2016 వరకు వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. 2018లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈ ఏడాది జూలైలో ఖమ్మంలో జరిగిన కాంగ్రెస్ జనగర్జన సభలో రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. 2023లో పినపాక నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పార్టీ అధిష్ఠానం ప్రకటించింది.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

మణుగూరు రూరల్ : పినపాక అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ శుక్రవారం సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో 241 పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 30,31 తేదీల్లో పోలింగ్ సిబ్బందికి మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.రాఘవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్

గిరిజనేతరులే అధికం



చాపల ఎర్రయ్య



గుమ్మడి నర్సయ్య

- 1978 నుంచి ఎస్టీ రిజర్వ్‌డ్‌గా ఇల్లెందు
- పది దఫాలు ఎన్నికలు జరిగితే 9సార్లు ఆదివాసీల గెలుపు
- ఆరుసార్లు సీపీఐ(ఎంఎల్)ను ఆదరించిన ప్రజలు
- ప్రస్తుతం నియోజకవర్గంలో 2,14,527 మంది ఓటర్లు





ఊకె అబ్బయ్య



కోరం కనకయ్య



బానోతు హరిప్రియ

ఇల్లెందు: ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గం 1952లో ఏర్పడగా, 1978లో ఎస్టీ రిజర్వ్‌డ్‌గా మారింది. 2009లో పునర్విభజన చెందిన బొగ్గుట్ట సెగ్మెంట్ ఇల్లెందు, టేకులపల్లి, బయ్యారం, గార్ల, కామేపల్లి మండలాలతో విస్తరించి ఉంది. వీటిలో ఇల్లెందు, టేకులపల్లి మండలాలు భద్రాద్రి జిల్లాలో, కామేపల్లి ఖమ్మం జిల్లాలో, గార్ల, బయ్యారం మండలాలు మహబూబాబాద్ జిల్లాలో ఉన్నాయి. నియోజవర్గంలో ప్రస్తుతం 2,14,527 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 1,05,485, మహిళలు 1,09,040 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లలో బంజారుల ఓట్లు 60 వేల వరకు, ఆదివాసీ ఓట్లు 50 వేలు ఉండగా, గిరిజనేతర ఓటర్లు 1.14 లక్షల వరకు ఉన్నారు. ఓటర్లలో మాదిగలు 15 వేల మంది ఉండగా, మాలలు 13 వేలు, మున్నూరు కాపు 10 వేలు, యాదవ 10 వేలు, ముస్లింలు 10 వేలు, కమ్మ 4వేల ఓట్లు, ముదిరాజ్ 6 వేలు, గౌడ 8 వేలు, పద్మశాలి 5 వేలు, రెడ్డి 2 వేలు, ఆర్యవైశ్య 2 వేలు, విశ్వబ్రాహ్మణ 3 వేలు, వడ్డెర 3 వేలు, రజకులు 3 వేల ఓటర్లు ఉండగా, మిగతా కులాలవారు వెయ్యిలోపు ఓటర్లు ఉన్నారు. ఇక్కడ గిరిజనేతర ఓట్లే గెలుపును శాసిస్తున్నాయి.

ఆరుసార్లు ప్రజాపంథా–ఎన్డీ పార్టీ గెలుపు

ఎస్టీ రిజర్వ్‌డ్‌గా మారాక ఇప్పటివరకు 10 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆరు దఫాలు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా–ఎన్డీ గెలిచింది. ఒకసారి మిత్రపక్షాల మద్దతుతో సీపీఐ, ఒక దఫా టీడీపీ, రెండు దఫాలు కాంగ్రెస్ గెలిచింది. అయితే రెండుసార్లు కూడా గెలిచాక కాంగ్రెస్ అభ్యర్థులు బీఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే హరిప్రియ బరిలో నిలుస్తుండగా, కాంగ్రెస్ అభ్యర్థి ఇంకా ఖరారు కాలేదు. హస్తం పార్టీ నుంచి కోరం కనకయ్య టికెట్ రేసులో ఉన్నారు.

9 సార్లు ఆదివాసీలే

ఇల్లెందు గిరిజన అసెంబ్లీ నియోజకవర్గంలో 10 సార్లు ఎన్నికలు జరిగితే 9 సార్లు ఆదివాసీ అభ్యర్థులే విజయం సాధించారు. ఒకసారి మాత్రమే లంబాడీ గిరిజనురాలు హరిప్రియ గెలిచారు. తొలిసారి ప్రజాపంథా అభ్యర్థి చాపల ఎర్రయ్య ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆనాటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయన తన ఓటును కాంగ్రెస్ అభ్యర్థికి వేశారు. దీంతో ఆయనను ప్రజాపంథా బహిష్కరించింది. అనంతరం ఐదు దఫాలు గుమ్మడి నర్సయ్య, రెండు దఫాలు ఊకె అబ్బయ్య, ఒక్కో దఫా కోరం కనకయ్య, బానోతు హరిప్రియ ఎన్నికయ్యారు.

జనరల్ స్థానంలో...

1952 నుంచి 1957 వరకు ద్విసభ్య, 1972 వరకు జనరల్‌గా నియోజకవర్గంగా ఇల్లెందు కొనసాగింది. ఐదుసార్లు ఎన్నికలు జరగ్గా మూడుసార్లు కాంగ్రెస్, రెండుసార్లు పీడీఎఫ్, ఒకసారి సోషలిస్టు, మరోసారి సీపీఐ అభ్యర్థి గెలుపొందారు.

గెలిచిన అభ్యర్థులు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప ప్రత్యర్థి
1952(ద్విసభ్య)	ఊకె నాగయ్య	సోషలిస్టు పార్టీ	రామగోవిందం
1952	కెఎల్.నర్సింహారావు	పీడీఎఫ్.	కె.సోమయాజులు
1957	డి.నర్సయ్య	కాంగ్రెస్.	కె.బుచ్చయ్య
1957	కేఎల్.నర్సింహారావు.	పీడీఎఫ్	టీవీ పాపయ్య
1962 (జనరల్)	కేఎల్.నర్సింహారావు	సీపీఐ	జిఎస్.రావు
1967	జి.సత్యనారాయణ	కాంగ్రెస్	జి.రామకోటేశ్వరరావు
1972	వంగా సుబ్బారావు	కాంగ్రెస్	జీపీ రావు
ఎస్టీ రిజర్వు అయిన తర్వాత..			
1978	చాపల ఎర్రయ్య	సీపీఐ(ఎంఎల్)	కె.బుచ్చయ్య
1983	గుమ్మడి నర్సయ్య	సీపీఐ(ఎంఎల్)	జి.సోమ్లా నాయక్
1985	గుమ్మడి నర్సయ్య	సీపీఐ(ఎంఎల్)	పాయం ముత్తయ్య
1989	గుమ్మడి నర్సయ్య	సీపీఐ(ఎంఎల్)	ఊకె అబ్బయ్య
1994	ఊకె అబ్బయ్య	సీపీఐ	గుమ్మడి నర్సయ్య
1999	గుమ్మడి నర్సయ్య	సీపీఐ(ఎంఎల్)	భూక్యా దళ్‌సింగ్
2004	గుమ్మడి నర్సయ్య	సీపీఐ(ఎంఎల్)	ఎం.కల్పానాబాయి
2009	ఊకె అబ్బయ్య	టీడీపీ	కోరం కనకయ్య
2014	కోరం కనకయ్య	కాంగ్రెస్	బానోతు హరిప్రియ
2018	బానోతు హరిప్రియ	కాంగ్రెస్	కోరం కనకయ్య

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

ములకలపల్లి: మండల పరిధిలోని ములకలపల్లి, మాధారం, సీతారాంపురం పోలింగ్ కేంద్రాలను జెడ్పీ సీఈఓ విద్యాలత శుక్రవారం పరిశీలించారు. కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. దివ్యాంగ ఓటర్ల నిమిత్తం ర్యాంపు నిర్మించాలని తెలిపారు. ఎంపీడీఓ శ్రీను, ఎంపీఓ లక్ష్మయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శిశువు మృతిపై డీఎంహెచ్ఓ ఆరా



వైద్యురాలు తనూజతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శిరీష

చండ్రుగొండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శిశువు మృతిపై డీఎంహెచ్ఓ శిరీష ఆరా తీశారు. పీహెచ్‌సీని శుక్రవారం ఆమె సందర్శించి, రికార్డులను పరిశీలించారు. తిప్పనపల్లికి చెందిన సయ్యద్ ఫర్హాన కాన్పు చేయించుకోగా శిశువు మృతి చెందిన విషయం విదితమే. ఈ ఉదంతంపై డీఎంహెచ్ఓ శిరీష, స్థానిక వైద్యురాలు తనూజను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. సాధారణ కాన్పులు ప్రభుత్వాస్పత్రుల్లోనే జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చండ్రుగొండ పీహెచ్‌సీలో లక్ష్యానికి మించి కాన్పులు చేస్తున్నారని, శిశువు మృతి విషయంలో వైద్యపరంగా ఎలాంటి లోపం లేదని స్పష్టం చేశారు. శిశువు ఉమ్మనీరు తాగడం, తల్లికి నొప్పులు సక్రమంగా రాకపోవడంతోనే శిశువు మరణించినట్లు ఆమె వెల్లడించారు.

సర్వే పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

పాల్వంచ: వచ్చే నెల నవంబర్ 3వ తేదీ నుంచి జిల్లాలోని 838 పాఠశాలల్లో 3,6,9 తరగతి పిల్లలకు సంబంధించి స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో మండల కోఆర్డినేటర్లు, మండల విద్యాశాఖాధికారులు, రిసోర్స్ పర్సన్లకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. సర్వే సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో మౌలిక భాష, గణిత సామర్థ్యాల పట్ల అవగాహనను పరీక్షించి, తద్వారా బోధనా వ్యూహాలను మార్చేందుకు ఈ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో దాదాపు 19 వేల మంది విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కార్యదర్శి ఎస్.మాధవరావు, కో ఆర్డినేటర్లు సైదులు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సరైన పత్రాలు చూపి వాహనాలు తీసుకోండి

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న 307 ద్విచక్రవాహనాలు, 7 కార్లు హేమచంద్రాపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఉంచామని, అధికారి ఒ.సుధాకర్ శుక్రవారం తెలిపారు. ఈ వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లొచ్చని తెలిపారు. ముందుగా వాహనాలకు సంబంధించిన పత్రాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమర్పించి, రశీదు పొంది, మోటారు వాహనాల అధికారి కార్యాలయంలో సమర్పించి తిరిగి వాహనాన్ని పొందవచ్చని చెప్పారు. ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల ప్రకారం ఈ వాహనాల జాబితాను జిల్లా పోలీస్ సోషల్ మీడియా ఖాతాల్లో పెట్టడం జరిగిందని, వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రూ.1.63 కోట్లు సీజ్

చుంచుపల్లి: అసెంబ్లీ ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన దగ్గర నుంచి ఇప్పటివరకు జిల్లాలో రూ.1.63 కోట్ల నగదును పట్టుకున్నట్లు డీఆర్‌డీఓ జి.మధుసూదన్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 76 మంది నుంచి ఈ నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సరైన ధ్రువపత్రాలు చూపించిన 66 మందికి చెందిన రూ.1.50 కోట్లను తిరిగి చెల్లించినట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలు, వ్యాపారులు తమ అవసరం నిమిత్తం తీసుకెళ్లే నగదు విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ సరైన ఆధారాలు చూపించాలని పేర్కొన్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.12,231

పంచాయతీలకు పైసలేవి..?

అందని రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు
- కేంద్రం ఇచ్చే అరకొర నిధులతోనే పాలన..
- ఆర్థిక ఇబ్బందుల్లో చిన్న పంచాయతీలు
- గత ఏప్రిల్ నుంచి ఎదురుచూస్తున్న సర్పంచ్‌లు



వెంకటేశ్వరకాలనీ గ్రామ పంచాయతీ కార్యాలయం

చుంచుపల్లి: జిల్లాలో గ్రామ పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. కనీసం నిర్వహణ ఖర్చులు లేక సతమతమవుతున్నాయి. సకాలంలో ఆర్థిక సంఘం నిధులు రాకపోవడంతో చిన్నపాటి పనులు కూడా చేయలేక సర్పంచ్‌లు చేతులెత్తేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి విడుదల కావాల్సిన రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు ఇప్పటివరకు పైసా రాలేదు. కేవలం కేంద్రం నుంచి వస్తున్న అరకొర నిధులతోనే సర్పంచ్‌లు పాలనను నెట్టుకొస్తున్నారు. అవి కూడా ట్రాక్టర్ల కిస్తీలు, విద్యుత్ బిల్లులు, సిబ్బంది వేతనాలకే సరిపోతున్నాయి. ఒక్కోసారి సరిపోక అప్పులు చేయాల్సి వస్తోందని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గడిచిన ఏడు నెలలుగా పల్లెప్రగతి ముందుకు సాగడం లేదు. పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్ల నిర్వహణ చిన్న గ్రామ పంచాయతీలకు మోయలేని భారంగా మారుతోంది. వీటికి సంబంధించిన రుణాల కిస్తీలను ప్రతినెలా బ్యాంకులకు చెల్లించాలి. కొత్తగా ఏర్పడిన చిన్న పంచాయతీలకు ఆదాయ మార్గాలు లేకపోవడంతో వాయిదాలు కూడా చెల్లించలేని దయనీయ పరిస్థితి దాపురించింది.

ఆదాయం కంటే ఖర్చులే ఎక్కువ..

జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు కేటాయిస్తున్నారు. దీంతో చిన్న పంచాయతీలకు ప్రతి నెలా రూ.లక్షలోపే అందుతున్నాయి. ఉదాహరణకు చుంచుపల్లి మండలంలోని వెంకటేశ్వరకాలనీ పంచాయతీని పరిశీలిస్తే.. ఈ పంచాయతీకి ప్రతి నెలా ఆర్థిక సంఘం నిధులు రూ.72 వేలు మంజూరవుతున్నాయి. ట్రాక్టర్ కిస్తీలు, సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు, డీజిల్ ఖర్చులు రూ.95 వేల వరకు అవుతున్నాయి. దీంతో అప్పు చేయక తప్పడం లేదు. జిల్లాలోని మిగితా పంచాయతీల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇక ఇంటి పన్ను ద్వారా వస్తున్న ఆదాయం రెండు, మూడు ట్రాక్టర్ కిస్తీలకు కూడా సరిపోవడం లేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ చార్జీల భారం కూడా పెరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు సమకూర్చాలను కోరుతున్నారు.

పెండింగ్‌లో రూ.72.24 కోట్లు..

జిల్లాలో 481 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిల్లో ఎలాంటి ఆర్థిక వనరులు లేని చిన్న పంచాయతీలు 210 వరకు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు ప్రతి నెలా రూ.10.32 కోట్ల చొప్పున నిధులిస్తున్నాయి. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి మాత్రం ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు కేవలం రూ.51.60 కోట్లు మాత్రమే అందాయి. గత ఏప్రిల్ నుంచి రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు ఇప్పటివరకు ఒక్కపైసా రాలేదు. దాదాపు రూ.72.24 కోట్ల మేర రావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం వీటి గురించి పట్టించుకున్న పాపానపోలేదు.

నిధుల కొరత..



కొత్త పంచాయతీని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఎన్నికల్లో పోటీ చేసి సర్పంచ్‌గా గెలిచాను. మా గ్రామానికి ప్రభుత్వాలు విడుదల జేస్తున్న నిధులు ట్రాక్టర్ కిస్తీలు, ,విద్యుత్ బిల్లులు, సిబ్బంది జీతాలకే సరిపోతున్నాయి. ఒక్కో నెల చేతి నుంచి పెట్టుకోవాల్సి వస్తోంది. నిధుల కొరతతో అభివృద్ధి పనులు చేయలేకపోతున్నాం. ప్రభుత్వాలు చొరవ చూపి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలి.

–కాశీవిశ్వనాథ్, 4 ఇంక్లైన్ సర్పంచ్, చుంచుపల్లి మండలం

రైతులకు ఇబ్బంది కలగొద్దు..

- పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి
- కలెక్టర్ ప్రియాంక్ ఆల



మాట్లాడుతున్న కలెక్టర్



హాజరైన అధికారులు, మిల్లర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులు, మిల్లర్లతో వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈసీజన్‌లో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. కొనుగోళ్ల కోసం జిల్లాలో 159 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నామని, అవసరాన్ని బట్టి అదనంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఏ–గ్రేడ్ ధాన్యం రూ.2,203, బీ–గ్రేడ్‌కు రూ.2,183 మద్దతు ధర నిర్ణయించామని, రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున చెక్‌పోస్టుల వద్ద నిఘా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సెంటర్ ఇన్‌చార్జ్‌తోపాటు మిల్లర్‌పై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీఎం సివిల్ త్రినాథ్‌బాబు, డీఎస్‌ఓ రుక్మిణీదేవి, డీసీఓ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి కొర్సా అభిమన్యుడు, ఉద్యాన అధికారి జినుగు మరియన్న, జీసీసీ మేనేజర్ విజయ్‌కుమార్, తూనికల, కొలతల అధికారి మనోహర్, మార్కెటింగ్ అధికారి అలీం, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీ పినపాక, ఇల్లెందు అభ్యర్థుల ఖరారు



ఈసం కృష్ణ

గుండాల: పినపాక అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా గుండాలకు చెందిన ఈసం కృష్ణను న్యూడెమోక్రసీ పార్టీ ప్రకటించింది. కృష్ణ 1975 నుంచి 80 వరకు న్యూడెమోక్రసీ అజ్ఞాత దళంలో పనిచేశారు. 1987 నుంచి 92 వరకు గుండాల మండలం ఏర్పడిన అనంతరం మొట్టమొదటి ఎంపీపీగా గెలుపొందారు. ప్రస్తుతం న్యూ డెమోక్రసీ పార్టీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఆయన తండ్రి ఈసం బాటన్న కూడా 30 ఏళ్లపాటు అజ్ఞాత దళంలో పనిచేశారు. 1995 నుంచి 2000 వరకు, 2003 నుంచి 2013 వరకు వరుసగా మూడుసార్లు గుండాల జెడ్పీటీసీగా పనిచేశారు.

ఇల్లెందు అభ్యర్థిగా మోకాళ్ల కృష్ణ



మోకాళ్ల కృష్ణ

ఇల్లెందురూరల్: న్యూడెమోక్రసీ ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా మాణిక్యారం సర్పంచ్ మోకాళ్ల కృష్ణను ప్రకటించింది. ఈమేరకు పార్టీ రాష్ట్ర కమిటీ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. కృష్ణ 2001, 2013లలో రెండుసార్లు ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. మూడోసారి 2019లో కూడా సర్పంచ్‌గా గెలిచారు. ఇంటి పన్నుల వసూలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో గ్రామపంచాయతీని జిల్లాలో ఆదర్శంగా నిలిపి పలు అవార్డులు అందుకున్నారు. కాగా ఆయనకు న్యూడెమోక్రసీ చంద్రన్నవర్గం మద్దతు ప్రకటించింది.

హైవే పనుల్లో పర్సంటేజీల పంచాయితీ

బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రా కామేశ్



బంక్‌లో వాహనాలకు పెట్రోల్ కొడుతున్న కామేశ్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో పదేళ్లుగా జాతీయ రహదారి పనులు సాగుతూనే ఉన్నాయని, అధికార పార్టీ నాయకుల మధ్య పర్సంటేజీల పంచాయితీ వల్ల పనులు పూర్తికావడం లేదని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి, అడ్వకేట్ ఎర్రా కామేశ్ ఆరోపించారు. మన కొత్తగూడెం–మన కామేష్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని ఎంజీ రోడ్డులో ప్రచారం నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపు యజమానులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ ముర్రేడుపై చేపట్టిన రెండో బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్నాయే తప్ప పూర్తి కావడం లేదన్నారు. పాతతరం రాజకీయ నాయకుల మూస ధోరణి వల్ల కొత్తగూడెం అభివృద్ధి కుంటుపడిందన్నారు. అభివృద్ధి కోసం రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఏనుగు గుర్తుకు ఓటేయాలని, కొత్తగూడెం నుంచి తనను గెలిపించాలని కోరారు. అనంతరం బంక్‌లో పెట్రోల్ కొడుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంధం మల్లికార్జున్‌రావు, సాయి, మాలోత్ వీరునాయక్, నాగుల రవికుమార్, గుడివాడ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడులో వైరా అభ్యర్థి ప్రచారం

జూలూరుపాడు: బీఎస్పీ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ రాంబాబు నాయక్ శుక్రవారం జడలచింత, కొత్తూరు, చిన్నహరిజనవాడ, పెద్దహరిజనవాడ, పాపకొల్లు, భీమ్లాతండా తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఎస్పీ నాయకులు తంబర్ల నరసింహారావు, నారపోగు ఉదయ్, దామెర్ల పృథ్వీ, దేవరకొండ నిర్మల, కొంగల లలిత, కంచపోగు నరసింహారావు, నునావత్ మోహన్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన భద్రగిరికి..



భద్రాద్రి వెళ్తున్న భక్తులు

ములకలపల్లి: మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన పలువురు భక్తులు శుక్రవారం కాలినడనక భద్రాచలానికి పయనయ్యారు. సుమారు యాభై కిలోమీటర్లు నడిచి భద్రగిరికి చేరుకొని రామయ్యకు మొక్కులు చెల్లించుకుంటారు. భక్తబృందానికి ములకలపల్లి ఉపసర్పంచ్ శనగపాటి అంజి భోజన వసతి కల్పించారు. ములకలపల్లి విశ్వహిందూ పరిషత్ సభ్యులు గొడ్ల రాజు, కీసరి భద్రం తదితరులు పాల్గొన్నారు.

కోటమైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు



లెక్కింపులో పాల్గొన్న దేవాదాయ శాఖ ఉద్యోగులు

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మ తల్లి దేవాలయం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా యాభై రోజులకు గాను రూ.50వేల ఆదాయం సమకూరిందని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారి ఆర్.సమత వెల్లడించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు కాంతమ్మ, ఈఓ నల్లమోతు శేషయ్య, చైర్మన్ మల్లెంపాటి శ్రీనివాసరావు, అర్చకులు పుల్లయ్యశర్మతోపాటు నర్సింహాచారి, బడాటి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి శోభాయాత్రలో ఘర్షణ

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్)లో కనకదుర్గ అమ్మవారి శోభాయాత్ర సందర్భంగా జరిగిన ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. అమ్మ వారి శోభాయాత్ర గురువారం అర్ధరాత్రి ఒంటి గంట వరకు కొనసాగగా ఘర్షణ మొదలైంది. ఈ ఘటనలో సీపీఎంకు చెందిన కారంగుల చంద్రయ్య, ఎర్రబోయిన నాగేశ్వరావు, కారంగుల కోటేశ్వరావు, షేక్ మదార్‌కు గాయాలయ్యాయి. తమపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేశాయని వారు ఆరోపించారు. కాగా, క్షతగాత్రులను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా, సీఐ వసంతకుమార్, ఎస్‌ఐ సాయికుమార్ పరిశీలించి కేసు నమోదు చేశారు. కొంతకాలంగా గ్రామంలో సీపీఎం, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణ జరుగుతుండగా కొద్దిరోజుల క్రితం జరిగిన దాడుల్లో 50 మందిపై కేసు నమోదైంది. అయినా మళ్లీ గొడవ జరగడం గమనార్హం. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం నాయకుడు పోతినేని సుదర్శన్ శుక్రవారం గ్రామానికి వచ్చి క్షతగాత్రులను పరామర్శించారు. సర్పంచ్ ఉమ్మినేని బాబు, ఆయన కుమారుడు రమేష్ అకారణంగా తమ వారిపై దాడి చేయడమే కాక ఇళ్లపై రాళ్లు రువ్వారని ఆరోపించారు. పోలీసులు వైఫల్యం కారణంగానే తరచూ దాడులు జరుగుతున్నాయని తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

టేకులపల్లి: ఇంటర్ చదువుతున్న విద్యార్థిని కనిపించకుండా పోయిన ఘటనపై శుక్రవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని బద్దుతండా గ్రామానికి చెందిన బాలిక కొత్తగూడెంలోని ప్రతిభ జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం ఉదయం 8 గంటలకు కాలేజీకి వెళ్లివస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. మిత్రులు, బంధువులతోపాటు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా, చుక్కాలబోడు గ్రామానికి చెందిన మాళోత్ శివ తన కూతురి వెంటపడుతూ అప్పుడప్పుడు మాట్లాడుతుండేవాడని, మాయమాటలు చెప్పి తమ కూతురిని ఎక్కడికైనా తీసుకెళ్లి ఉంటాడేమోనని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తండ్రి చనిపోయాడనే దిగులుతో..

కుమారుడు ఆత్మహత్య



సమ్మన్న (ఫైల్)

ములకలపల్లి: తండ్రి చనిపోయాడనే దిగులుతో మనస్తాపానికి గురై కుమారుడు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మాధారం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన, కూలి పనులు చేసుకుని జీవించే కొమ్మిడి ముత్తయ్య నెల రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. తండ్రి చనిపోయిన నాటి నుంచి కుమారుడు కొమ్మిడి సమ్మన్న (21) తీవ్రంగా కలత చెందాడు. పలుమార్లు తల్లి రమాదేవి, భార్య నాగేశ్వరి ధైర్యం చెప్పినా పదేపదే తండ్రిని గుర్తుచేసుకుంటూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో సమ్మన్న పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబీకులు 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. సమ్మన్న చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తిరుమల్‌రావు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

సుజాతనగర్: అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధిస్తున్న భర్త, మామ, అత్త ముగ్గురిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ ఎం.సోమేశ్వర్ కథనం మేరకు.. మండలంలోని స్టేషన్ బేతంపూడి గ్రామానికి చెందిన శ్యామలకు, పాల్వంచ మండలం గట్టాయిగూడెంనకు చెందిన కుంజా సంపత్‌కుమార్‌తో 2022లో వివాహం జరిగింది. పెళ్లి ఖర్చుల కింద రూ.5 లక్షల నగదు, 5 తులాల బంగారం శ్యామల తల్లిదండ్రులు ఇచ్చారు. సుమారు 6 నెలల పాటు సజావుగా సాగిన వారి దాంపత్యంలో గొడవలు మొదలయ్యాయి. అదనపు కట్నం మరో రూ.5 లక్షలు తీసుకురావాలంటూ భర్త, అత్త పాపమ్మ, మామ ఆదినారాయణ వేధించడం ప్రారంభించారు. ఈ క్రమంలో ప్రసవం నిమిత్తం శ్యామల తన తల్లిదండ్రుల ఇంటికి వచ్చి ఆడపిల్లకు జన్మనిచ్చింది. కాగా, అదనపు కట్నం రూ.5 లక్షలు తెస్తేనే కాపురానికి తీసుకెళ్తామంటూ భర్త, అత్తా, మామలు చెప్పడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

50 మంది బైండోవర్



బెల్టుషాపు నిర్వాహకులను బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

టేకులపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం ఇల్లెందు ఎక్సైజ్ సీఐ బి.రాంప్రసాద్ ఆదేశాల మేరకు ఎస్‌ఐలు పామర్తి రమాదేవి, ఉమానుల్లాఖాన్ సిబ్బందితో కలిసి మండలంలో తనిఖీలు నిర్వహించారు. బెల్టుషాపులు నిర్వహిస్తున్న 50 మందిని టేకులపల్లి తహసీల్దార్ కొండపల్లి కృష్ణవేణి ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది రవిబాబు, బాబా, తులిశ్యా, మల్లికార్జున్, కృష్ణవేణి పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



గుగులోతు సోని

పాల్వంచ: పట్టణ పరిధిలోని పాలకోయతండాకు చెందిన శతాధిక వృద్ధురాలు మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. పాలకోయతండాకు చెందిన గుగులోతు సోనీ వృద్ధాప్య సమస్యల కారణంగా శుక్రవారం మృతి చెందింది. కాగా, ఆమె వయసు 125 ఏళ్లు ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. గుగులోతు సోనికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు.

హైదరాబాద్‌లో మండలవాసి..



రవీందర్ (ఫైల్)

కరకగూడెం: మండలంలోని తాటిగూడెం గ్రామానికి చెందిన జిమ్మిడి రవీందర్ (24) శుక్రవారం హైదరాబాద్‌లో ప్రమాదవశాత్తు మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఏడాది కిందట స్వగ్రామాన్ని విడిచి బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లిన యువకుడు ఉప్పల్ ప్రాంతంలోని ఓ భవన నిర్మాణ మేస్త్రీ వద్ద సహాయకుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. విధుల్లో భాగంగా బకెట్‌లో ఇసుక తరలిస్తుండగా లిఫ్ట్ తెగి రవీందర్‌పై పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రవీందర్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



సంతోష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగు గ్రామంలో హైస్కూల్ సమీపంలో మొండికుంట – భద్రాచలం రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మొండికుంట గ్రామానికి చెందిన యువకులు ఎడ్ల సంతోష్‌రెడ్డి (32), మీ సేవ కేంద్రం నిర్వాహకుడు కందిమళ్ల శ్రీధర్‌రెడ్డి (37) మృతి చెందారు. సంతోష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి బైక్‌పై మొండికుంట నుంచి భద్రాచలం వెళ్తుండగా హైస్కూల్ సమీపంలో మొండికుంట వైపు వెళ్తున్న ట్రాక్టర్ లైట్లు లేకుండా అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో ఎడ్ల సంతోష్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీధర్‌రెడ్డిని 108 ద్వారా భద్రాచలం తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సంతోష్‌రెడ్డి పాల్వంచ కేటీపీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈయనకు గతంలో వివాహం జరగగా దంపతులు విడిపోయారు. మరో పది రోజుల్లో మరో యువతితో వివాహం జరగనుంది. వివాహానికి సంబంధించిన పనులపై శ్రీధర్‌రెడ్డితో కలిసి బైక్‌పై భద్రాచలం వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు మృతి చెందారు. శ్రీధర్‌రెడ్డి మొండికుంట గ్రామంలో ఎన్నో ఏళ్లుగా మీ సేవ కేంద్రం నిర్వహిస్తూ ఓ దినపత్రిక రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. వారిద్దరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ సురేశ్‌కుమార్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

యువకుడిపై దాడి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలో ఓ యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. లక్ష్మీదేవిపల్లిలో నివాసముంటున్న ఒడ్డెబోయిన శివకుమార్ బీరువాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు శివకుమార్‌పై రాళ్లతో దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న శివకుమార్ సోదరుడు ఘటనా స్థలానికి వచ్చి, శివకుమార్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్ తరలించారు. శివకుమార్ అక్క ధనలక్ష్మి గురువారం లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

పత్తి మద్దతు ధర రూ.18,500గా నిర్ణయించాలి


ఖమ్మం మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మంవ్యవసాయం: పత్తి క్వింటాకు మద్దతు ధర రూ.18,500గా నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఖమ్మం మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లను శుక్రవారం పరిశీలించిన అనంతరం సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తి దిగుబడి గణనీయంగా పడిపోవడంతో రైతులు నష్టపోయారని తెలిపారు. గత ఏడాది రూ.13 వేల వరకు పలికిన పత్తి ధర క్రమంగా తగ్గినప్పటికీ సీసీఐ రూ.7,020 ధర నిర్ణయించిందని చెప్పారు. అయితే, ఈ ధర ఏ మాత్రం సరిపోదని, రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రతినిధులు పాశం అప్పారావు, కేలోత్ లక్ష్మణ్, చిలకల నర్సింహారావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

రేపు అండర్-14 క్రీడా జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన జిల్లాస్థాయి పాఠశాలల క్రీడా జట్ల ఎంపికకు ఈ నెల 29వ తేదీన పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కె.నర్సింహమూర్తి తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయిలో అండర్-14 విభాగం నుంచి షూటింగ్, లాన్ టెన్నిస్, జూడో, జిమ్నాస్టిక్స్ జట్లను, అండర్-17 విభాగంలో నెట్‌బాల్ బాలబాలికల జట్లు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే ఎంపిక పోటీలకు క్రీడాకారులు తమ వయస్సు ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు.

జాతీయస్థాయి ఉషూ పోటీలకు ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్: గోవాలో జరగనున్న 37వ జాతీయస్థాయి ఉషూ పోటీలకు జిల్లా నుంచి పి.పవిత్రాచారి ఎంపికైంది. జిల్లా నుంచి ఎంపికైన మొదటి క్రీడాకారిణి కాగా, ఆమెను శుక్రవారం డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి అభినందించారు. కాగా, ఉషూ టోర్నీ నవంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు గోవాలో జరగనుంది. కార్యక్రమంలో ఉషూ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.పరిపూర్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తుల సేకరణ పెంచాలి


మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలంటౌన్: ఏజెన్సీలోని గిరిజనుల నుంచి అటవీ ఉత్పత్తుల సేకరణ పెంచాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన జీసీసీ అధికారులతో సమీక్షించారు. ఏజెన్సీలోని అటవీ ఉత్పత్తుల సేకరణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇందుకోసం ఆదివాసీలకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహించాలని తెలిపారు. కాగా, ఈ సమావేశం అనంతరం జీసీసీ జీఎం సీతారాం.. అధికారులతో సమావేశమయ్యారు. గిరిజన సహకార సంస్థల ద్వారా ఆదివాసీ గిరిజనుల నుంచి ముష్టి గింజల సేకరణను పెంచాలని, వారికి గిట్టుబాటు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈసమావేశాల్లో సమావేశంలో ఏపీఓ డేవిడ్ రాజ్, అధికారులు ఉదయ్‌భాస్కర్, విజయ్‌కుమార్, సత్యనారాయణ, దీపాలాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


పురస్కారాలను అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: పదో తరగతి, ఇంటర్‌లలో 95 శాతం మార్కులు సాధించిన ఖమ్మం సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ షేర్ హోల్డర్స్ పిల్లలకు యాజమాన్యం శుక్రవారం నగదు పురస్కారాలు అందజేసింది. ఖమ్మంలోని బాలాజీనగర్‌లో జరిగిన సమావేశంలో సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ కే.వీ.సుబ్బయ్య చౌదరి మాట్లాడుతూ గత 26 ఏళ్లుగా ప్రతిభ కనబర్చిన బ్యాంకు షేర్ హోల్డర్ పిల్లలకు పురస్కారాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈసారి నలుగురికి రూ.10 వేలతో పాటు ప్రశంసాపత్రాలను అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కె.సైదేశ్వరరావు, బ్రాంచ్ రిలేషన్‌షిప్ మేనేజర్ జి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి దసరా ధమాకా..

- 14 రోజుల్లో రూ.1.40 కోట్ల ఆదాయం
- పండుగ వేళ రీజియన్‌లో 15.62 లక్షల మంది ప్రయాణం


ఖమ్మం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ (ఫైల్)

ఖమ్మంమామిళ్లగూడెం/చుంచుపల్లి: బతుకమ్మ, దసరా పండుగలతో ఆర్టీసీకి దండిగా ఆదాయం సమకూరింది. అధికారులు ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి 14 రోజులపాటు ప్రత్యేక సర్వీసులు నడిపించారు. ఈ నెల 13 నుంచి 26 వరకు ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు డిపోల నుంచి 695 సర్వీసులను హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాలకు తిప్పారు. అధికారుల ఏర్పాట్లకు తగినట్లుగా ప్రయాణికులు అధికంగా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించడంతో ఆదాయం కలిసొచ్చింది. దీంతో గడిచిన 14 రోజుల్లో ఖమ్మం రీజియన్‌కు రూ.1.40 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో ఖమ్మం డిపోకు అత్యధికంగా రూ.41,19,771 రాగా, రెండో స్థానంలో భద్రాచలం డిపోకు రూ.38,85,459 ఆదాయం వచ్చింది. ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) కూడా పెరిగిందని అధికారులు తెలిపారు.

రీజియన్‌లోని డిపోల పరిధిలో వచ్చిన దసరా ఆదాయం (రూ.ల్లో)

డిపో	ఆదాయం	ఓఆర్ శాతం
ఖమ్మం	41,19,771	70
భద్రాచలం	38,85,459	74
సత్తుపల్లి	25,62,102	69
మణుగూరు	16,85,097	72
కొత్తగూడెం	9,96,509	70
మధిర	6,57,319	64
ఇల్లెందు	97,274	63

రద్దీని ఊహించుకుని..

పండుగల సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు ఆదాయం రాబట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తున్నారు. ఇటీవల రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక సర్వీసులు నడిపించడంతోపాటు లక్కీ డ్రా ప్రవేశపెట్టగా భారీ ఆదాయం సమకూరింది. దీంతో దసరా రద్దీని ఊహించిన అధికారులు అదనపు చార్జీలు లేకుండానే ప్రత్యేక సర్వీసులు నడిపించారు. అలాగే, రాఖీ మాదిరిగా లక్కీ డ్రా ప్రవేశపెట్టారు. ఫలితంగా ప్రయాణికులు ఆర్టీసీ వైపు మొగ్గు చూపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి దసరాకు ప్రయాణికుల సంఖ్య పెరిగింది. దసరాకు ప్రత్యేక బస్సుల్లో ఏకంగా 15.62 లక్షల మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్లిరావడం విశేషం. తద్వారా ఆర్టీసీ ఆశించిన దాని కంటే అధిక ఆదాయం సమకూరడంతో ఉద్యోగుల్లో జోష్ నింపినట్లయింది.

సమష్టి సహకారంతో సాధ్యమైంది..



దసరా పండుగ సందర్భంగా ముందస్తుగా ప్రణాళికలు రూపొందించి ప్రత్యేక బస్సులను హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు నడిపాం. రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో 695 సర్వీసులను తిప్పాం. ఫలితంగా ఊహించిన దాని కంటే అధికంగా ఆదాయం సమకూరింది. ఉద్యోగుల సమష్టి సహకారంతోనే ఇది సాధ్యమైంది.

– సీహెచ్.వెంకన్న, ఆర్‌ఎం

ఎస్సారెస్పీ కాల్వకు గండి..

- అమీనాపురంలో రాత్రి వేళ గండికొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు
- కేసముద్రం స్టేషన్‌లో జలమయమైన కాలనీలు

కేసముద్రం: గుర్తు తెలియని వ్యక్తులు ఎస్సారెస్పీ కాల్వకు గండికొట్టడంతో సాగునీరు వృథాగా పోయిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని అమీనాపురం సమీపాన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎస్సారెస్పీ డీబీఎం-48 కాల్వ నుంచి వెళ్లే ఉపకాల్వ(14ఎల్)కు అమీనాపురం వద్ద పాయింట్ ఏర్పాటుచేశారు. అక్కడ గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గండికొట్టారు. దీంతో నిండుకుండలా ఉన్న అమీనాపురం గ్రామ చెరువులోకి నీరు చేరి, ఆపై మత్తడి పడింది. నీటి ప్రవాహంతో శుక్రవారం తెల్లవారుజామున కేసముద్రం స్టేషన్‌లోని అంబేడ్కర్‌సెంటర్, సంతోష్‌నగర్ కాలనీ జలమయమయ్యాయి. దీంతో కాలనీప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. గుర్తుతెలియని వ్యక్తులు కాల్వకు జేసీబీని ఉపయోగించి గండి కొట్టినట్లుగా స్థానికుల ద్వారా తెలిసింది. ఈ సమాచారం అందుకున్న ఎస్సారెస్పీ డీఈ కుమారస్వామి, ఏఈ రూప్‌కుమార్ చేరుకుని డీబీఎం-48కాల్వ వద్ద గేట్ మూయించారు. ఆతర్వాత గండి పడిన చోట మట్టితో మరమ్మతులు చేపట్టడమే కాక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డీఈ తెలిపారు.


కాల్వ గండి నుంచి వృథాగా పోతున్న నీరు


ఎస్సారెస్పీ జలాలతో జలమయమైన కేసముద్రం స్టేషన్‌లోని అంబేడ్కర్‌సెంటర్

బియ్యం ధరలకు రెక్కలు


రిటైల్‌గా విక్రయించే సన్న బియ్యం

- సన్న రకాలకు క్వింటా రూ.6 వేలకు పైగానే..
- ఇతర రకాల ధర రూ.4 వేల నుంచి రూ.5,200 పైమాటే
- తొమ్మిది నెలల్లో రూ.2,700 మేర పెరిగిన ధర
- సన్నరకాల సాగు తగ్గడం, రైతుల వద్ద నిల్వలు లేకే ఈ పరిస్థితి

ఖమ్మంవ్యవసాయం: ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు.. అన్న చందంగా పప్పులు, బియ్యం ధరలు నానాటికీ పెరుగుతున్నాయి. నెల క్రితం వరకు కూరగాయల ధరలతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. కొద్ది రోజులుగా పప్పుల ధరలు పెరిగాయి. ప్రధానంగా కంది పప్పు ధర రెట్టింపు స్థాయికి చేరింది. ఇంతలోనే బియ్యం ధరలకు కూడా రెక్కలొచ్చాయి. ప్రస్తుతం సన్నరకాల బియ్యం ధర క్వింటా రూ.6వేలకు పైగా పలుకుతుండగా, ఇతర రకాల ధరలు రూ.4,500 నుంచి రూ.5,200 వరకు ఉన్నాయి. సీజన్‌తో పోలిస్తే క్వింటాకు ఏకంగా రూ.2 వేల నుంచి రూ.2,700 వరకు పెరగడం గమనార్హం.

రిటైల్‌కు వచ్చే సరికి..

ప్రస్తుతం సన్న రకాలను హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.56 నుంచి రూ.62 వరకు విక్రయిస్తున్నారు. బీపీటీ 5204(సాంబ మసూరి) రకం బియ్యం పాతవైతే కిలో రూ.60 కాగా, కొత్తవి రూ.54 వరకు ధర ఉంది. హెచ్ఎంటీ రకం హోల్‌సేల్‌లో రూ.62 కాగా, జగిత్యాల సాంబ(జేజీఎల్) రూ.56కు విక్రయిస్తున్నారు. ఇక రిటైల్ మార్కెట్‌లో కిలో ఒక్కంటికి రూ.2 నుంచి రూ.3 వరకు పెంచి అమ్ముతున్నారు. అలాగే సాధారణ రకాలను వివిధ బ్రాండ్ల పేరుతో రూ.45 నుంచి రూ.52 వరకు అమ్ముతుండడం ప్రజలకు భారంగా మారింది.

సహజమే అయినా అనూహ్యంగా..

పంట సీజన్‌తో పోలిస్తే ప్రస్తుతం బియ్యం ధర గణనీయంగా పెరిగింది. సన్న రకాల్లో కొన్ని రెట్టింపు స్థాయికి చేరాయి. పంటలు చేతికందే జనవరిలో సన్న బియ్యం ధర రకాన్ని బట్టి క్వింటాకు రూ.3,400 నుంచి రూ.3,800 వరకు ఉంటుంది. బియ్యం పాత పడితే కొద్దిమేర ధర పెరగడం సహజం. అయినా సన్న రకాల ధర రూ.4,500 నుంచి రూ.5,000కు మించి పలకపోగా.. ఈ ఏడాది ఏకంగా రూ.5,600 నుంచి రూ.6,200 వరకు చేరింది.

ధాన్యం నిల్వల కొరత

సన్న రకాల ధాన్యం నిల్వల కొరత బియ్యం ధరలు పెరగడానికి ఓ కారణంగా విశ్లేషిస్తున్నారు. రైతుల వద్దే కాక మార్కెట్‌లోనూ నిల్వలు తరిగిపోయాయి. ఈ ఏడాది రైతులు ధాన్యాన్ని అంతగా నిల్వ చేయకపోగా, నిల్వ చేసిన వారు అమ్మేశారు. మిల్లర్ల వద్ద మాత్రం నిల్వలు ఉన్నాయి. ధరల పెరుగుతాయనే అంచనాతో కొందరు మిల్లర్లు పెద్ద ఎత్తున ధాన్యాన్ని నిల్వచేసినట్లు సమాచారం.

సాగు తగ్గడం మరో కారణం

కేంద్రప్రభుత్వం వరిలో గ్రేడ్-1, కామన్ వెరైటీలకు నిర్ణయించే ధరలో తేడా రూ.20 వరకే ఉంటోంది. దొడ్డు రకాలతో పోలిస్తే సన్న రకాల కాలపరిమితి 20నుంచి 25రోజులు ఎక్కువ. తెగుళ్ల బెడద కూడా అధికమే. అలాగే, దొడ్డు రకాలతో పోలిస్తే సన్న రకం దిగుబడి తక్కువ. ఇలా రకరకాల కారణాలతో రైతులు దొడ్డు రకాల సాగుకే ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో సన్న రకాల సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. అలాగే, ఈ ఏడాది సాగర్ ప్రాజెక్టులోకి తగినంత నీరు చేరక ఆయకట్టులో వరిసాగు తగ్గింది. ఖమ్మం జిల్లాలో సాధారణ వరిసాగు 2.80లక్షల ఎకరాలు కాగా 2.25లక్షల ఎకరాలకు మించలేదు. ఆలస్యంగా కురిసిన వర్షాలతో సాగు తగ్గడమే కాక రైతులు దొడ్డు రకాలే ఎక్కువగా సాగు చేశారు. ఈ ప్రభావం కూడా బియ్యం ధరలపై పడిందని తెలుస్తోంది.

సీజన్, అన్ సీజన్లలో బియ్యం హోల్‌సేల్ ధరలు(క్వింటాకు రూ.ల్లో)

బియ్యం రకం	సీజన్	అన్ సీజన్
సాంబమసూరి	3,600	6,000
హెచ్ఎంటీ	4,100	6,200
జగిత్యాల సాంబ	3,000	5,000
పాయి సాంబ	2,800	4,600

గత ఏడాదితో పోలిస్తే ధర పెరిగింది



గత ఏడాది 25 కిలోల సాంబ మసూరి సీజన్‌లో రూ.వెయ్యికి లభించగా, అన్ సీజన్‌లో రూ.1,200 దాటలేదు. ఈ ఏడాది సీజన్‌లో రూ. 1,100 వరకు ఉండగా ఇప్పుడు రూ.1550కు విక్రయిస్తున్నారు. ఐదారు నెలల్లోనే పావు క్వింటా బియ్యానికి రూ.550 వరకు ధర పెరిగింది.

– సోమారపు సుధీర్‌కుమార్, ప్రకాశ్‌నగర్, ఖమ్మం

కొరత కారణంగానే పైపైకి..



సాగు తగ్గిపోయి, సన్న రకాల ధాన్యం నిల్వలు తగ్గడంతో బియ్యం ధరలు పెరిగాయి. మునుపెన్నడూ లేనివిధంగా ప్రస్తుతం క్వింటాకు రూ.2,500 మేర ధర పెరిగింది. మిర్యాలగూడెం, హుజూర్‌నగర్, సూర్యాపేట ప్రాంతాల నుంచి జిల్లాకు బియ్యం సరఫరా అవుతున్నాయి.

– రాయపూడి వెంకటేశ్వరరావు, వ్యాపారి, ఖమ్మం

ప్రత్యేక శ్రద్ధతో మెరుగైన బోధన, ఉత్తమ ఫలితాలు

గిరిజన గురుకులాల ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలంఅర్బన్: గిరిజన గురుకులాల్లోని పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని గిరిజన గురుకులాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో సమావేశమైన ఆర్‌సీఓ మాట్లాడుతూ దసరా సెలవులు ముగిసినందున విద్యార్థులంతా త్వరగా పాఠశాలకు వచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, వార్షిక పరీక్షల కోసం ఇప్పట్నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ దేవదాసు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులను తీసుకొస్తున్న తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఆర్‌సీఓ డేవిడ్‌రాజు

భద్రాద్రిలో నేడు శబరి స్మృతి యాత్ర

పాక్షిక చంద్రగ్రహణంతో సాయంత్రం ఆలయం మూసివేత


శబరి విగ్రహం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యాన శనివారం శబరి స్మృతి యాత్ర నిర్వహించారు. ఏటా ఆశ్వయుజ మాసంలో పౌర్ణమి రోజున రామయ్యకు అపర భక్తురాలైన శబరికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ యాత్రను 2013లో ప్రారంభించారు. అప్పటి నుంచి పలు గ్రామాల నుంచి గిరిజనులను భద్రాచలానికి ఆహ్వానించి వారి సంస్కృతి, సంప్రదాయాల నడుమ యాత్రను వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం గిరి ప్రదక్షిణ, పుష్పాంజలి ఇతర కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఇందుకోసం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు.

నేటి సాయంత్రం ఆలయం మూసివేత

పాక్షిక చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం రామాలయాన్ని మూసివేయనున్నారు. సాయంత్రం స్వామి వారి సేవా కార్యక్రమాల అనంతరం ఆలయం తలుపులు మూసి తిరిగి ఆదివారం తెల్లవారుజామున సంప్రోక్షణ అనంతరం తెరవనున్నారు. అప్పటి వరకు భక్తులకు దర్శనాలు ఉండవని ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు.

ఓటర్లకు అవగాహన కోసం..

- ప్రభుత్వ కళాశాల ప్రహరీపై వాల్‌పెయింటింగ్‌లు
- విద్యార్థులకు పోటీలు నిర్వహించిన అధికారులు


వాల్ పెయింటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఆదర్శ్ సురభి


పెయింటింగ్ వేస్తున్న విద్యార్థిని

ఖమ్మంమయూరిసెంటర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటర్లు అందరూ ఓటుహక్కు వినియోగించుకునేలా అధికార యంత్రాంగం విస్తృత ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగా ఓటర్లకు అవగాహన కల్పించేలా వాల్ పెయింటింగ్ వేయించేందుకు గాను విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కేఎంసీ కమిషనర్, ఖమ్మం రిటర్నింగ్ అధికారి ఆదర్శ్ సురభి ఆధ్వర్యాన ఖమ్మంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో శుక్రవారం పోటీలు ఏర్పాటుచేయగా, డీఆర్‌ఎస్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆలోచింపచేసే రీతిలో చిత్రాలు గీశారు. ప్రలోభాలకు లోనుకావొద్దని, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటు వేయడాన్ని బాధ్యతగా భావించాలనే సూచనలతో బొమ్మలు గీయగా ఆర్‌ఓ ఆదర్శ్ సురభి అభినందించారు.

అస్ట్రోటర్ఫ్ వికెట్‌లో రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఆకట్టుకునేలా కోహ్లీ బొమ్మ !


నెట్స్‌లో ఏర్పాటు చేసిన కోహ్లీ మైనపు బొమ్మ

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అస్ట్రోటర్ఫ్ వికెట్‌లో ప్రాక్టీస్ కోసం శుక్రవారం సాయంత్రం నుంచి రిజిస్ట్రేషన్లు మొదలయ్యాయి. దాదాపు రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన అస్ట్రోటర్ఫ్ వికెట్‌లో మొత్తం నాలుగు పిచ్‌లు సిద్ధం చేశారు. అంతేకాక మరో రెండు వికెట్లను ముందు భాగంలో రూపొందించారు. ఇందులో ప్రాక్టీస్ కోసం క్రీడాకారులు, ఔత్సాహికులు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఇప్పటికే 30 మందికి పైగా నమోదు చేసుకున్నారని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎండీ.మసూద్ పాషా తెలిపారు. కాగా, నెట్స్‌లోకి కేవలం క్రికెటర్లకు మాత్రమే అనుమతి ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎండీ ఫారుఖ్, తురాబ్ అలీ తదితరులు పాల్గొన్నారు. కాగా, పిచ్ వద్ద స్టాండ్స్‌లో ఏర్పాటుచేసిన విరాట్‌కోహ్లీ మైనపు బొమ్మ ఆకట్టుకుంటోంది.



పేర్లు నమోదు చేసుకున్న క్రికెటర్లతో నిర్వాహకులు

చెదిరిపోతున్న జ్ఞాపకం!

- పాల్వంచలో 1964 నాటి థియేటర్ నేలమట్టం
- 'తెర'మరుగవుతున్న చరిత్ర


వేణుగోపాల్ థియేటర్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

పాల్వంచ: పాల్వంచ చరిత్రలో మొట్టమొదటి సినిమా హాల్ అయిన వేణుగోపాల్ థియేటర్ నేలమట్టమవుతోంది. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ థియేటర్‌తో ఇక్కడి ప్రజలకు మరిచిపోలేని బంధం ఉంది. 1964 సంవత్సరంలో ఈ థియేటర్‌ను నిర్మించగా.. మూడు తరాల ప్రజలు సినిమాలు వీక్షించారు. నాడు రూ.10 పైసలతో టికెట్ ధర మొదలైందని వృద్ధులు చెబుతుంటారు. సినిమా పోస్టర్లను వెదురు తడెకపై అంటించి ఇద్దరు మనుషులు ఊరూరా తిరిగి ప్రచారం చేసేవారట. దీంతో సినిమా చూసేందుకు స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎడ్ల బండ్లు, సైకిళ్లు, కాలినడకన వచ్చేవారని చెబుతారు. ఇక ఉదయం సినిమాకు రాత్రే వచ్చి పడుకునేవారని, ఆఖరి షో ముగిశాక రవాణా సౌకర్యం లేక ఇక్కడే పడుకున్న వారూ ఉన్నారని పలువురు చెబుతున్నారు. కాగా, వేణుగోపాల్ థియేటర్ యజమానురాలు రాధమ్మకు నటరాజ్ సెంటర్ వద్ద రాజేశ్వరి, మినీ రాజేశ్వరి థియేటర్లు, కొత్తగూడెంలో నాగేశ్వర టాకీస్ ఉండేవి. కాలక్రమేణా రాజరాజేశ్వరి, మినీ రాజేశ్వరి తీసేసి అపార్ట్‌మెంట్ నిర్మించారు. అలాగే, నాగేశ్వర టాకీస్ స్థానంలో షాపింగ్ మాళ్లు నిర్మించారు. మిగిలిన వేణుగోపాల్ థియేటర్‌ను రాధమ్మ కుమార్తె మీనా కుమారి నిర్వహిస్తుండగా, కరోనా సమయంలో మూతపడింది. ప్రస్తుతానికి ఈ థియేటర్‌ను నేలమట్టం చేస్తుండగా, భవిష్యత్‌లో షాపింగ్ కాంప్లెక్స్ లేదా, మల్టీప్లెక్స్ థియేటర్ నిర్మించాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఏదిఏమైనా ఎందరికో జ్ఞాపకంగా ఉన్న థియేటర్ నేలమట్టం అవుతుండడంతో ఆవేదనగా చూస్తూ ముందుకు సాగుతున్నారు.

30 నుంచి విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా ఈనెల 30 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూవ్‌మెంట్), చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ జె.ఆల్విన్ తెలిపారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరిని క్రియాశీలపరిచేలా ఈ వారోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. అన్ని గనులు, విభాగాల వద్ద తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో వాల్‌పోస్టర్లు ప్రదర్శిస్తామని తెలిపారు. అలాగే, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించడమేకాక విద్యార్థినీ, విద్యార్థులకు అవినీతి రహిత సమాజ స్థాపనకు 'అవినీతిని తిరస్కరించండి-దేశం పట్ల నిబద్ధత కలిగి ఉండండి' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.